

ఎక్కడ చూసినా రద్దీ

జిల్లాలో సుమారు 3 లక్షల మందికిపైగా వలసజీవులు ఉన్నారు. తీరప్రాంతాలైన ఎచ్చెర్ల, రణస్థలం, నరసన్నపేట, పోలాకి, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, కంచిలి, మందస, గార, సంతబొమ్మాళి మండలాల నుంచి మత్స్యకార కుటుంబాలతో పాటు మిగిలిన మండలాల్లోని యువత ఉపాధి కోసం వలసబాట పట్టారు. విజయవాడ, రాజమండ్రితోపాటుగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వీరావల్(గుజరాత్), ముంబై వంటి ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. సంక్రాంతి నేపథ్యంలో వారంతా స్వగ్రామాలకు చేరుకోవడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్, రైళ్లు కిటకిటలాడాయి. మరోవైపు రూ.కోట్లలో వ్యాపారాలు సాగాయి. వస్త్రవ్యాపారం సుమారు రూ.500 కోట్లు ఉంటుందని వ్యాపారవర్గాల అంచనా. అలానే బంగారం రూ.75 కోట్లు, నిత్యావసరాలు రూ.150 కోట్ల మేర విక్రయాలు సాగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. శనివారం శ్రీకాకుళంలో ఏ దుకాణం చూసినా జనసందోహమే కనిపించింది. జీటీ రోడ్డులో రద్దీ కారణంగా ద్విచక్ర వాహనంపై కూడా తిరగడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది.



శ్రీకాకుళం జీటీ రోడ్డులో జనాల రద్దీ..

సొంతగూటికి వలస జీవులు

- ప్రారంభమైన పెద్ద పండగ వేడుకలు
- జనసంద్రంగా ప్రధాన రోడ్లు, కూడళ్లు



బస్సుల వద్ద ప్రయాణికుల హడావుడి

(శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట)

ముంగిట్లో భోగిమంట.. వాకిట్లో ముగ్గుల వంట.. రైతుల లోగిళ్లలో ధాన్యపురాశులు.. పసుపు కుంకుమలు అద్దుకున్న గొబ్బెమ్మలు.. హరిదాసు కీర్తనలు.. జంగమ దేవర దీవెనలు.. గంగిరెద్దుల ప్రదర్శనలు.. పిండి వంటల ఘుమఘుమలు.. పేకాటలు.. పిల్లల కేరింతలు.. ఇవన్నీ సంక్రాంతి పండగలో కనిపించే దృశ్యాలు. నాడు పల్లెల్లో మూడు రోజుల పాటు పండగ వైభవంగా సాగేది. మారుతున్న కాలానికి అనుగుణంగా.. నేడు అంతటి సందడి లేకపోయినా.. ఆచార సంప్రదాయాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. తొలిరోజు భోగిమంటలు వేసి కొత్తజీవితాలకు శ్రీకారం చుడతారు. మరుసటి రోజు పితృదేవతలకు ఇంటికి ఆహ్వానించే పెద్దల పండగ జరుపుతారు. మూడో రోజు పశువులకు శుభాకాంక్షలు చెప్పే కనుము, మరుసటి రోజున చిన్నపిల్లలు పండుగగా జరుపుకునే ముక్కనుముతో సంక్రాంతి ఉత్సవాలు ముగుస్తాయి. ఈ క్రమంలో పెద్ద పండగను స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకునేందుకు వలసజీవులంతా స్వస్థలాలకు చేరుకుంటున్నారు. బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాలు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు జిల్లాలో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. శనివారం శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస ఇలా ప్రతి పట్నంలోనూ వస్త్ర దుకాణాలు, మార్కెట్‌లు జనసంద్రంగా మారాయి.

నేడు భోగభాగ్యాల భోగి

భోగి పండగను ఆదివారం వేడుకగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు వేయనున్నారు. ఇంట్లో ఉన్న పాత చీపుర్లు, తట్టలు, విరిగిపోయిన వస్తువులు, పిల్లలు తయారుచేసిన పిడకలు మంటల్లో వేసి కొత్త జీవితాన్ని ప్రసాదించాలని వేడుకుంటారు. అలాగే భోగి పండ్లు పిల్లల తలపై పోస్తారు. దీనివల్ల పిల్లలకు దిష్టి తగలకుండా ఉంటుందని నమ్మకం. ఇదిలా ఉండగా ప్రస్తుతం పాడి సంపద తగ్గడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం భోగిపిడకలను తయారు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. అందుబాటులో ఉండే కలపను వినియోగించి భోగిమంటలు వేస్తూ మమ అనిపిస్తున్నారు.



నరసన్నపేటలో చెంచుల సందడి

రేపు మకర సంక్రాంతి

దక్షిణాయం నుంచి సూర్యుడు ఉత్తరాయణంలోకి అడుగిడే పవిత్ర ఘడియాల్లో సంక్రాంతి వస్తుంది. ఈ నెల 15న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పితృదేవతలకు తర్పణం వదిలి.. వారిని ఇంటికి ఆహ్వానించి కొలుస్తారు. దీనిని పెద్ద పండగగా పిలుస్తారు. 15న ఉదయం 8.26 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పుణ్యకాలం ఉంటుందని పండితులు చెబుతున్నారు.

ఆనందాల కనుమ..


సంక్రాంతి పర్వదినాల్లో మూడోరోజు కనుమ పండగ. రైతన్నల నేస్తాలు పశువులకు పొంగలివేసి, పంటల్లో పోలి పోసి కనుమ పండగ చేస్తారు. ఉదయమే పశువులను శుభ్రంగా కడిగి రంగులు అద్దుతారు.. అనంతరం గ్రామ శివారుల్లో పశువులన్నింటికి ఒక దగ్గరకు చేర్చి ప్రత్యేకంగా పూజిస్తారు. ఆ తర్వాత తీర్థాన్ని పొలాల్లో చల్లితే సిరులు పండుతాయని రైతులు నమ్మకం.

ఆ కుటుంబాలకు భోగీయే పెద్దపండగ

నందిగాం: బెజ్జిపల్లి పంచాయతీ సింగుపురంలో నివశిస్తున్న తాడి, తుంగాన, యజ్జల తదితర కుటుంబాలకు భోగీ పండగే పెద్దపండగ. పూర్వీకుల నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోందని, భోగీరోజు పెద్దలకు మడపల్లు పెడతామని గ్రామస్థులు తెలిపారు. అలాగే నందిగాంలోని అప్పిని కుటుంబ సభ్యులు కూడా భోగీనాడే పండగ జరుపుకొంటారు. నర్సిపురంలో సనపల వారి కుటుంబాలు కనుమ నాడు పండగ చేసుకుంటారు.

మలగాంలో..

సంతబొమ్మాళి: మలగాం గ్రామస్థులు భోగి పండగకు దూరంగా గడుపుతున్నారు. మలగాం గ్రామంలో వివిధ కులాలకు చెందిన ఐదు వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. పండగ, కనుమ, ముక్కనుమను ఎంతో ఘనంగా జరుపుకొనే గ్రామస్థులు భోగి పండుగ మాత్రం చేసుకోవడం లేదు. కొన్నేళ్ల కిందట మలగాంలో భోగి మంట వేయగా.. అందులో పిల్లి పడిపోయింది. అప్పటి నుంచి గ్రామంలో భోగి మంట వేయడం లేదని పూర్వీకులు చెప్పారని మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ, గ్రామ పెద్ద బుచ్చ మోహనరావు తెలిపారు. పూర్వీకుల నుంచి ఈ ఆచారం కొనసాగుతోందన్నారు.



మలగాం గ్రామం



వీధుల్లో గంగిరెద్దులు

తగ్గిన సందడి..

ఇచ్ఛాపురం రూరల్: సంస్కృతీ సంప్రదాయాలకు నెలవైన సంక్రాంతి పండగ సందడి.. గతంతో పోల్చితే తగ్గింది. సంక్రాంతి వచ్చిందంటే చాలు.. కొత్త అల్లుళ్ల సందడి, గాలిపటాలతో పిల్లల కేరింతలు, గంగిరెద్దులు, హరిదాసు, బుడబుక్కలవారు, సోదిసానులు, వీధి బాగోతాలు, సిద్దేశులు, డూడూ బసవన్న, జంగముల హడావిడి కనిపించేది. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే సందడి ఉండేది. ప్రస్తుతం గ్రామాల్లో వలసబాట పట్టడం, తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటలు లేకపోవడం, ఆదాయ మార్గాలు కరువవ్వడం వంటి అంశాలు సంక్రాంతిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. క్రమేపీ సంప్రదాయాలు కనుమరుగైపోతున్నాయి. గంగిరెడ్ల ఆటలు, బుడబుక్కలవారి సందడి, హరిదాసులు, సిద్దేశులు వంటివి పిల్లలు సైతం ఈ వృత్తులను విడిచిపెట్టి వేరే మార్గాలు చూసుకుంటున్నారు. కుటుంబ పోషణ కష్టంగా మారడంతో వలసలు పోతున్నారు. ఆచారాలను విడిచిపెట్టి ఆదాయ మార్గాను చూసుకుంటున్నారు.



బూరవిల్లి గ్రామం

ఆ గ్రామాలు.. భోగికి దూరం

- బూరవిల్లిలో పూర్వీకుల నుంచి కొనసాగుతున్న ఆచారం

గార, జనవరి 13: సంక్రాంతికి ముందు వచ్చే భోగి పండగను ఇంటిల్లిపాదీ సందడిగా జరుపుకొంటారు. కానీ జిల్లాలో కొన్ని గ్రామాలు భోగికి దూరంగా ఉంటాయి. పూర్వీకుల నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. గార మండలం బూరవిల్లి గ్రామస్థులు భోగి పండగను జరుపుకోరు. భోగి రోజున ఆడపిల్లలు, అల్లుళ్లు వస్తారు. మరోవైపు ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్నవారంతా స్వగ్రామాలకు చేరుకుంటారు. కొత్తవస్త్రాలు ధరిస్తారు. కానీ, భోగి మంట మాత్రం వేయరు. సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అందరిలాగే ఘనంగా జరుపుకొంటారు. పెద్దల కాలం నుంచి ఈ ఆచారం కొనసాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామంలో మరికొన్ని ఆచారాలు, సంప్రదాయాలు నేటికీ కొనసాగుతున్నాయి. ఉగాది రోజు రైతులు ఏరువాక పూజ చేయరు. తర్వాత మరో రోజు ప్రత్యేకంగా ఏరువాక చేస్తారు. నాగులచవితి కూడా షష్టి రోజు చేస్తారు. దీపావళి, దసరా రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సంప్రదాయంగా వస్తోంది..



మా గ్రామంలో భోగి పండగ రోజున భోగిమంట వేయకపోవడం సంప్రదాయంగా వస్తోంది. తాతముత్తాతల కాలం నాటి నుంచే ఇదే కొనసాగుతోంది. నాగులచవితి కూడా అందరిలా కాకుండా సుబ్రహ్మణ్య షష్టినాడు నిర్వహిస్తాం.

-ఆరవెల్లి సీతారామస్వామి, గ్రామ పురోహితులు, బూరవిల్లి



మురిఖిండిభద్రలో..

సంక్రాంతికి ఆ గ్రామం ఖాళీ

మెళియాపుట్టి: సంక్రాంతికి దేశ, విదేశాల్లో ఉన్న వారు సైతం స్వగ్రామాలకు చేరుకుంటారు. కానీ మెళియాపుట్టి మండలం మురిఖిండిభద్రలో మాత్రం ఇళ్లన్నీ ఖాళీగా కనిపిస్తాయి. ఈ గ్రామంలో సంచార గంగిరెద్దులకు చెందిన 30 కుటుంబాలు జీవిస్తున్నాయి. పండగ వేళ.. భిక్షాటన కోసం గంగిరెద్దులతో వారంతా మిగిలిన గ్రామాల బాట పడతారు. దీంతో ఇళ్లన్నీ బోసిపోతాయి. ప్రస్తుత తరం ఈ కులవృత్తికి దూరంగా ఉంటున్నారు. ఓ వైపు గంగిరెద్దులు కొనుగోలు చేయలేక.. మరోవైపు వాటి పోషణ భారం కావడం.. దానికి తగ్గటు ఆదాయం లేకపోవడంతో చాలా మంది వలసబాట పడుతున్నారు. కులవృత్తిని వదులుకోలేక ఆచారాలు పాటిస్తూ జీవనం సాగిస్తున్నామని గ్రామానికి చెందిన బి.వెంకటరావు, రామారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బతుకుతెరువు కష్టంగా ఉందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

లింగాలవలసలో..

జలుమూరు : లింగాలవలసలో కూడా గ్రామస్థులు భోగీ పండగకు దూరంగా ఉంటారు. పూర్వం భోగి రోజు కొండపై నుంచి పులి గ్రామంలో చొరబడి దొరికిన వారిని ఎత్తుకెళ్లిందని పెద్దలు చెబుతున్నారు. దీంతో భోగి మంట వేయరాదని అప్పట్లో తీర్మానం చేశారని... తరతరాల నుంచి ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు.


కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి

- జగనాసుర చీకటి పాలనను భోగి మంటల్లో దహించి వేయాలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్న

టెక్కలి, జనవరి 13: వైసీపీ పాలనలో అన్ని రంగాలకూ నష్టం వాటిల్లిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, వ్యాపారులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇలా ఎంతోమంది భవిష్యత్ కోల్పోయి.. అంధకారంలో ఉన్నారు. జగనాసుర చీకటి పాలనను భోగి మంటల్లో దహించి వేయాలి' అని టీడీపీ శ్రేణులకు అచ్చెన్న శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద ఆదివారం ఉదయం 7గంటలకు తనతో పాటు ఎంపీ రామ్మోహన్‌నాయుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. ఈ పండగ వేళ.. కీడు తొలగాలి.. ఆంధ్రప్రదేశ్ వెలగాలని ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి.. కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

నందిగాం మండలం కాపుతెంబూరుకి చెందిన పలువురు వైసీపీని వీడి అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. పోలాకి యోగేశ్వరరావు, కొల్లి వెంకట్రావు, కె.ఖగేశ్వరరావు తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మరో 90 రోజుల్లో టీడీపీ అధికారంలోకి రానుందని తెలిపారు. టీడీపీ-జనసేన కూటమి 160 స్థానాలు కైవసం చేసుకుంటాయన్నారు. 'అధికారపార్టీ అక్రమాలు పెరిగిపోతున్నాయి. విద్యుత్, బస్సు, పెట్రో ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని అచ్చెన్నాయుడు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి హరి తదితరులు ఉన్నారు.



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన కాపుతెంబూరు గ్రామస్థులు

అనుమానితులపై సమాచారం ఇవ్వండి

- హడ్కో కాలనీలో కార్డెన్‌సెర్చ్

శ్రీకాకుళం క్రైం, జనవరి 13: పరిసర ప్రాంతాల్లో అనుమానితులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని టూటౌన్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం నగరం హడ్కో కాలనీలో శనివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ట్రైనీ డీఎస్పీ చప్పిడి రాజు, శ్రీకాకుళం సీఐ ఆర్.సన్యాసినాయుడు, నలుగురు ఎస్‌ఐలతో పాటు 103మంది పోలీసులతో ఐదు బృందాలుగా ఏర్పడి 620 ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. 497 ద్విచక్ర వాహనాలు, ఏడు కార్లు, నాలుగు ఆటోల రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేని 10 ద్విచక్ర వాహనాలను టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. పేకాట, కోళ్ల పందాలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వెంటనే 100 లేదా 6309990824 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి ఊరెళ్లే వారు పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తామన్నారు.



శ్రీకాకుళం హడ్కోకాలనీలో పోలీసుల కార్డెన్‌సెర్చ్

నరసన్నపేటలో..

నరసన్నపేట: పట్టణంలోని పురుషోత్తమ్ నగర్ కాలనీలో శనివారం వేకువ జామున సీఐ బర్ల ప్రసాద్ అధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సిబ్బందితో కలిసి కాలనీలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలు లేని ఐదు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పేకాట, కోడిపందెలు ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వై. సింహాచలం సారవకోట, జలుమూరు ఎస్‌ఐలతో 40మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన

సమస్యల పరిష్కారం, హామీల అమలు కోరుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె కొనసాగిస్తూనే ఉన్నారు. శనివారం ఇచ్ఛాపురంలోని బస్టాండ్ జంక్షన్ వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్నా.. పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వానికి ఓ దండం అంటూ నినాదాలు చేశారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హైమా, సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు లక్ష్మీనారాయణ మద్దతు తెలిపారు.

- ఇచ్ఛాపురం



పూజారిపై ఉపాధ్యాయుడు దాడి

పలాస రూరల్: పలాస మండలం గోపాలపురం గ్రామంలో అందుడైన పూజారిపై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం గ్రామ పొలాల్లో పైపులు వేసే సమయంలో గుడి గోడను కూల్చేందుకు కొంతమంది ప్రయత్నించారు. దీనిపై పూజారి కవిటి శ్రీనివాసరావు వారిని ప్రశ్నించాడు. దీంతో వారిమధ్య వాగ్వాదాలు జరిగాయి. ఉపాధ్యాయుడైన బొత్స షన్ముఖరావు అతనిపై దాడి చేసి గాయపర్చాడు. దీంతో బాధితుడు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సారాతో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కంచిలి: కలాపాని గ్రామంలో సవర దుర్లభో, సవర మహాలక్ష్మి ఇళ్లల్లో ఎస్.బాలరాజు తన సిబ్బందితో దాడి చేయగా దుర్లభో ఇంటిలో 300 సార ప్యాకెట్లు, మరో మహిళ మహాలక్ష్మి ఇంటిలో 250 సార ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, ఇరువురుపై కేసు నమోదు చేసి చేసినట్టు ఎస్.బాలరాజు తెలిపారు.

అగ్నిప్రమాదంలో గడ్డి కుప్పలు దగ్ధం

పాతపట్నం: అచ్యుతాపురం గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగి గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. బీశెట్టి జోగారావు -శీనివాసరావుకు చెందిన సుమారు 10 ఎకరాల రెండు గడ్డికుప్పలు అగ్నిప్రమాదంలో ఆహుతయ్యాయి. టెక్కలి నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు

4,400 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో ఏఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 120 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు 4,400 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. శనివారం సోంపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ, స్పెషల్ పోలీసులు సంయుక్తంగా మందస మండలంల కరియాపల్లిలో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సెబ్, ఇంటలిజెన్స్, డీటీఎఫ్,ఆర్మ్ రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

● **పాతపట్నం:** మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ ఆశిన్ తెలిపారు. శనివారం వాహన తనిఖీలు చేస్తుండగా పొందూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మద్యంతో ఎనిమిది ఫుల్ బాటిళ్లు తరలిస్తున్నారు.. నిందితుల నుంచి ఎనిమిది ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

● **శ్రీకాకుళం క్రైం:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయించి సొమ్ము చేసుకోవాలన్న ఆలోచనతో 100 మద్యం సీసాలు తరలిస్తూ ఓ వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎచ్చెర్ల మండలం బొంతలకూడూరు గ్రామానికి చెందిన పంచిరెడ్డి ధనుంజయ్ నగరంలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం సీసాలు కొనుగోలు చేసి తరలిస్తూ శనివారం రాత్రి మిల్లు జంక్షన్‌లో వన్‌టౌన్ పోలీసులకు పట్టుకున్నారు. ధనుంజయ్‌పై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తులు

శ్రీకాకుళం క్రైం: నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న 500 మంది కార్మికులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా బట్టలు పంపిణీ చేశారు. ఏటా నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తారు. ఈ మేరకు స్థానిక బాపూజీ కళా మందిరంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● **శ్రీకాకుళం కల్చరల్:** ఆదిత్య వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బురిడి గౌరీశంకర్, గురువు, కేఎస్ఎన్ మూర్తి, ఆర్‌వీ లక్ష్మి, యస్ఆర్ఐ మహేష్, ఉషాసుందరి సౌజన్యంతో 70 మందికి రగ్గులు, దుప్పట్లు, పండ్లు తదితర వాటిని వాకర్స్ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధజనాశ్రమ నిర్వాహకులు యూవీ రమణ, బీఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** మదుపాంలో రాజాం జీఎంఆర్ సంస్థ సౌజన్యంతో 130 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోగాది అప్పలనాయుడు, జీఎంఆర్ ప్రతినిధుతు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● **పొందూరు:** మండల కేంద్రంలో పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీరంగ నాయకులు డీవీఎస్ ప్రకాశరావు, కోరుకొండ సాయికుమార్, గుంటుకు సత్యారావు, ఆనంద్‌మోహన్, ఎం.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.


పేదలకు వస్త్రాలు అందజేత



దుస్తులు పంపిణీ చేస్తున్న వైద్యులు సురేష్

గుజరాతీపేట: కనుగులవలస, కొండపేట గ్రామాల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత, సంఘ సేవకులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు, వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల వృద్ధులు, చిన్న పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుండె ఊపిరితిత్తులకు, పక్షవాతం తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పనితీరుపై స్పష్టంగా చెప్పాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుండ

గుజరాతీపేట: రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై మంత్రి ధర్మాన స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. అరసవల్లిలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముఖ్యమైన యాక్ట్ అయినప్పటికీ ఈ చట్టం మీద ప్రజలకు, న్యాయవాదులకు అనేక అపోహలు కలగడం వల్ల న్యాయవాదులు హైకోర్టు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంలో మంత్రి ధర్మాన మాట్లాడే తీరుతో ఇంకా అపోహల్నే పెంచేలా ఉన్నాయన్నారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రహదారి విషయంలో టీడీపీ హయాంలో నిధులు మంజూరు చేస్తే నేటికి పూర్తి చేసుకోలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంకు మళ్లీ నిధులు మజూరు చేయించారని వైసీపీ నాయకులు పాలాభిషేకాలు చేస్తే ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు.

భక్తి కీర్తనలతో మేలుకొలుపు



మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

జి.సిగడాం: మండలంలో వివిధ గ్రామాల్లో సంక్రాంతికి నెల రోజులు ముందు నుంచి మేలుకోలుపులు నిర్వహిస్తున్నారు. శనివారం పాలఖండ్యాంలో మేలుకోలుపు ఘనంగా నిర్వహించారు. భక్తి కీర్తనలతో గ్రామ పురవీధులతో పాటు పరిసర గ్రామాల్లో మేలు కోలుపులు చేపట్టారు. ఈ సందర్భంగా సేకరించిన బియ్యం, నగదుతో ఆఖరి రోజున అన్న సమారాధన నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూర్యనారాయణ, గర్జంకి శ్రీనివాసరావు, తవుడుబాబు, తవిటయ్య, రమణ, శివ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులతో అడ్డుకోలేరు

● జిల్లాలో కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన



టెక్కలి రూరల్: టెక్కలిలో నిరసన తెలుపుతూ..



ఆమదాలవలస: భోగి మంట వేసుకుని అంగన్‌వాడీలు, సిబ్బంది నిరసన



కోటబొమ్మాళి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బెదిరింపులతో తమ ఉద్యమాన్ని అడ్డుకోలేరని పలువురు అంగన్‌వాడీలు పేర్కొన్నారు. గత 33 రోజులుగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అంగన్‌వాడీల ఆందోళన శనివారం కూడా కొనసాగుతోంది. కొన్నిచోట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం

జగన్‌రెడ్డికి శిక్ష తప్పదు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

శ్రీకాకుళం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరస్థుడిగా 38 కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం జగన్‌రెడ్డి జన్మజన్మలకు యావజ్జీవ శిక్ష తప్పదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఘాటుగా విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఐడీని అడ్డం పెట్టుకుని నీలి మీడియాలో చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలకు, దుష్ప్రచారాలకు జగన్ దిగారని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ తన జేబు సంస్థలను వాడుకుంటున్నారని చెప్పారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ జగన్‌రెడ్డి తీరును, పెత్తందారీ పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారని వివరించారు. రూ.43వేల కోట్ల దోపిడీలో జగన్‌రెడ్డిపై 38 కేసులు నమోదయాయి.. ఇందులో సీబీఐ, ఈడీ చార్జిషీట్లు కూడా వేసిందన్నారు. ఈ కేసుల్లో కోర్టుకు హాజరు కాకుండా వాయిదాలు తీసుకుని రికార్డు నమోదు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలపై పెట్టిన కేసుల్లో సీఐడీ చార్జిషీట్ ఎందుకు వేయలేకపోయిందని ప్రశ్నించారు. 2004లో రూ.1.73 కోట్లు ఆస్తి కలిగి ఉన్న జగన్‌రెడ్డికి 19 ఏళ్లలో రూ.4 లక్షల కోట్లకు ఎలా ఎగబాకారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

ఆదిత్యాలయంలో భక్తులకు వసతి

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి సరైన వసతి సదుపాయాలు లేక నగరంలోని హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో భక్తులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్వామివారి ఇంద్రపుష్కరిణి సమీపంలో డీలక్స్ గదులను సిద్ధం చేశారు. చక్కని వసతి సదుపాయాలతో, ఏసీ గదులను సిద్ధం చేశారు. ఆలయ అధికారులను సంప్రదించి ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఏసీ డబుల్ బెడ్‌రూమ్ కేవలం వెయ్యి రూపాయలకే భక్తులకు కేటాయిస్తున్నారు. అలాగే మరో తొమ్మిది గదుల నిర్మాణం చేస్తున్నామని, దాతలు ముందుకు రావాలని, ఒక్కో గది నిర్మాణానికి రూ. మూడు లక్షలు అవుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

ప్రసాదం వితరణ

ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేసిన పులగం ప్రసాదం సమర్పించారు. అనంతరం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తులకు ప్రసాద వితరణ గావించారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం ఇంద్రపుష్కరిణి వద్ద భోగి మంటలు, ఆలయంలో భోగి పళ్లు, సంక్రాంతి రోజున ముగ్గుల పోటీలు, కనుమ రోజున గోపూజ, కోలాట, ఇతర భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళాన్ని అందిస్తున్న భక్తులు

ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి శనివారం నగరంలోని పీఎన్ కాలనీకి చెందిన జవ్వాది రమాజయశ్రీ, వారి కుమార్తెలు జవ్వాది శ్రీజ, శ్రీహ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఈవోకు అందజేశారు. వారిని అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

నిరుద్యోగులకు తీరని అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అరసవల్లి: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్నా శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ విడుదల చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విద్య, వైద్య, ఆర్థిక శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, రాజేష్, రవి, రామమూర్తి, యువత పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

రణస్థలం: రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో బీజేపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇంత వరకూ ఏ ప్రభుత్వం చేపట్టని సంక్షేమం ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. నిరుపేదల అభ్యున్నతకు మోదీ ఎంతో కృషి చేస్తోన్నారని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలు సర్వనాశనం

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

పొందూరు: వైసీపీ పాలనలో వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. కింతలి గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవస్థలను జేబు సంస్థలుగా మార్చేసిన ఘనత జగన్‌రెడ్డిదేనని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని సర్వనాశనం చేశారన్నారు. నియోజకవర్గంలో రాష్ట్రప్రభుత్వం చేసిన అభివృద్ధి కంటే ఎంపీ నిధులతో జరిగిన అభివృద్ధే ఎక్కువన్నారు. మరో మూడునెలల్లో వైసీపీ దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలుగనుందన్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన దుంపల సన్యాసిరావు సమకూర్చిన నూతన వస్త్రాలను పేదలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రామప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గాడు నారాయణరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరభాస్కర్, డి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బెంతు ఒరియాల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న బెంతు ఒరియాలు

కవిటి: బెంతు ఒరియాలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ వారంతా గత 17రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కవిటిలో వారంతా అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కులగుర్తింపుపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వానికి తమ నరిసన ద్వారా తెలియజేస్తున్నారు. దీక్ష శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా సందర్శించి తమ ప్రగాఢ సంఘీభావం తెలిపారు

రామారావు మృతి టీడీపీకి తీరని లోటు



చీమలవలస గ్రామంలో పర్యటిస్తున్న రవికుమార్

ఆమదాలవలస: చీమలవలస గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు సనపల రామారావు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామారావు కుటుంబాన్ని రవికుమార్ శనివారం పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే పలు గ్రామాల్లో రవికుమార్ పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

కవిటి: స్థానిక రామాలయం వద్ద గోదాదేవి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసంలో ప్రతీ రోజూ వేకువ జామున గోదాదేవి పూజలు నిర్వహించి చివరి రోజున కల్యాణ మహోత్సవాన్ని చేపట్టారు. ● **కంచిలి:** స్థానిక కంచమ్మతల్లి ఆలయంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నిర్వహించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. ● **ఇచ్ఛాపురం:** పట్టణ పరిధి గిలాయి వీధిలో కొలువుదీరిన వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం భక్తులు గోదాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే బెల్లుపడ శివానందగిరి కొండపై కొలువుదీరి ఉన్న త్రినాథస్వామి ఆలయ ప్రాంగణలో సంక్రాంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.



ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు



కొనుగోలుదారులతో కిక్కిరిసిన డైలీ మార్కెట్

మార్కెట్‌కు పండగ శోభ

ఇచ్ఛాపురం: పట్టణంలో ఎటు, చూసినా జనం అడుగుతీసి అడుగు వేయలేనంత రద్దీ. శనివారం ఇచ్ఛాపురం మార్కెట్‌లో కనిపించాయి. అటు సంక్రాంతి కొనుగోలు దారులు, ఇటు వలస కార్మికులు రాకతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పట్టణ ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన జనాలతో పట్టణం కిక్కిరిసిపోయింది. మరోవైపు గింగిరెద్దుల ఆటలు, బుడబుక్కలు, హరిదాసులు వంటివి సందడి చేశారు.

కూర్మనాథుని సన్నిధిలో టెక్కలి ఆర్డీవో

గార: శ్రీకూర్మంలోని ప్రసిద్ధ కూర్మనాథ స్వామి వారిని శనివారం టెక్కలి ఆర్డీవో భరత్ నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రసాదాన్ని ఆలయ ఈవో గురునాథరావు వారికి అందజేశారు.

నేడు టీడీపీ ఆత్మీయ సమ్మేళనం

సరుబుజ్జిలి: కొత్తకోట గ్రామంలో ఆదివారం టీడీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ హాజరు కానున్నట్టు తెలిపారు. ఆమదాలవలస నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైం: చట్టాన్ని అతిక్రమించి కోళ పందాలు, పేకాట, పిక్కాట, పొట్టేలు పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ వై.శృతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఎటువంటి అశ్లీల నృత్యాలు నిర్వహించడం నేరమని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, తాగి వాహనాలు నడిపినా నే రమన్నారు. స్వగ్రామాలకు వెళ్లేవారు విలువైన ఆభరణాలు, నగదు బంధువుల ఇళ్లలో గాని, బ్యాంకు లాకర్లో కానీ భద్రపర్చుకోవాలన్నారు. జాతర్ల జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మద్యం కల్తీ చేస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యాన్ని కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం దుకాణాల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చూసుకోవాలని, అవసరమైతే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. సంక్రాంతి డిమాండ్‌కు తగ్గట్టు అన్ని షాపులకు సరిపడే స్టాక్ అందించామన్నారు. బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయొద్దని, ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జి.సిగడాం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. శనివారం నడిమివలస, చెట్టుపొదిలాం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, నాయకులు టి.అప్పలరాజు, పి.దాశరథి, ఈవోఆర్డీ ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ స్థానిక నాయకుడైన ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కే మళ్లీ ఇవ్వాలని వైసీపీ మండల నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేఖరులతో మాట్లాడారు. కిరణ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారన్నారు. జడ్పీటీసీ కాయల రమణ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై ఎంపీకి వినతి

సరుబుజ్జిలి: తెలికిపెంట పంచాయతీ పరిధిలో వంశధార నదిపై ఉన్న వంతెన వద్ద ప్రయాణికుల విశ్రాంతి భవన నిర్మాణానికి నిదులు మంజూరు చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును కోరినట్టు సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకుడు నందివాడ గోవిందరావు తెలిపారు. ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల ప్రజల రాకపోకలతో కొమనాపల్లి, సరుబుజ్జిలి రహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని, బ్రిడ్జి వద్ద ఎటువంటి నీడ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

'అంగన్‌వాడీలను చులకన చేయడం తగదు'

అరసవల్లి: గత 32 రోజులుగా జీతాలు పెంచమని అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వారిపై ఇంత చిన్నచూపు తగదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. శనివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయల జీతం అదనంగా ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు నిలబెట్టుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

గొప్ప మేధావి అంబేడ్కర్

శ్రీకాకుళం క్రైం: ప్రపంచంలోనే ఒక గొప్ప మేధావి బీఆర్ అంబేడ్కర్ అని అటువంటి మేధావికి జరిగే గౌరవ వందనం ఆయన విగ్రహ ఆవిష్కరణ అని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవి ష్కరిస్తున్నందున జిల్లా ప్రజలు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ విభాగం నాయకులు పొన్నాడ రుషి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి దిశా నిర్దేశం చేశారు. పలువురు ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి

శ్రీకాకుళం క్రైం: ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవంలో అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కళింగ వైశ్య, బేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్నాల శ్రీనివాసరావు, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్తా, చంద్రభూషణ్ గుప్తా, గుడ్ల దామోదర్, తంగుడు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్ నుంచి ఆ గ్రామం వరకు ఉన్న బీటీ రహదారి భారీ గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు అధికారులు గాని, ఇటు ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం లేదు. ఈ జంక్షన్ నుంచి కొమనాపల్లి బ్రిడ్జి మీదుగా పలాస, టెక్కలి, నరసన్నపేట, సరుబుజ్జిలి, పాలకొండ, ఆమదాలవలస ప్రాంతాలకు నిత్యమూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న కాగితాపల్లి మాజీ సర్పంచ్ మునకాల సూర్యారావు శనివారం తన సొంత డబ్బులతో ఈ గుంతలను పూడ్చి వేయించారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 13: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. జయసింహ ఆధ్వర్యంలో ఏజెంట్లు, సంఘ నేతలు శనివారం పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 11 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన అచ్చెన్నాయుడు మాట్లా డుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాతన సమస్యలు పరిష్కరిస్తామని, అంతవరకు అధైర్య పడవద్దన్నారు. ఎలాంటి ఆత్మ హత్యలకు పాల్ప వద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యు లు అరెలమ్మ, కె.శ్రీను, జి.రవి, ఇ.భాస్కరరావు, కె.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కోటబొమ్మాళి పంచాయతీ రెండు, మూడు వార్డులతో పాటు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ వైశ్య సాధికారిక కమిటీ కన్వీనర్ బోయిన గోవింద రాజులు, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో పలువురు నేతలు కోరారు. శనివారం పార్టీ కార్యాల యంలో అచ్చెన్నను కలిసి వినతిపత్రం అందించారు. టీడీపీ హయాంలో తాగునీటి పథకాలు ఏర్పాటు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని సక్రమంగా నిర్వహించక పోవడంతో మరమ్మతులకు గురయ్యాయని, తగు చర్యలు తీసుకుని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కోరాడ గోవిందరావు, మెట్ట మోహన రావు బోయిన శ్రీనివాసరావు, మంగి రమణ, అచ్చెయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి తాళ్లవలస గ్రామస్థులు

సంతబొమ్మాళి: మండలంలోని తాళ్లవలస గ్రామస్థులు వైసీపీని వీడి శనివారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మార్పు మన్మథరావు, సూర్యనారాయణ, గున్న మల్లేష, బెందాళం కృష్ణ, ప్రగడ నారాయణ, చమళ్ల రాములు, గున్న పాపారావు, వల్లభ అప్పారావు, దాసరి రమణమూర్తి, గున్న రాము, మార్పు రామారావు, మార్పు రమణయ్య, దాసరి కృష్ణమూర్తి తదితరులు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అచ్చెన్నా యుడుతోనే గ్రామా లు అభివృద్ధి సాధ్యమని, వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, అందువల్లే ఆ పార్టీని వీడామని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం రానున్నదని అందరికీ సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి పాటుపడతామని అచ్చెన్నాయుడు అన్నారు.



సంతబొమ్మాళి: అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన తాళ్లవలస గ్రామస్థులు

సోషల్ మీడియా ప్రతినిధులకు అభినందన

టెక్కలి: టీడీపీ యాప్‌లో పార్టీ నుంచి వస్తున్న ప్రతి పోస్టును సోషల్ మీడియాలో షేర్ చేస్తూ 30 వేల పాయింట్లు సాధించిన టెక్కలి నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతి నిధులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మె ల్యే అచ్చెన్నాయుడు శనివారం అభినందించారు. దల్లి ప్రసాద్‌రెడ్డి, రావాడ వెంకటేష్, యర్ర య్యలను అభినందిస్తూ పార్టీ జెండా లోగోను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోళ్ల లవకుమార్, కోళ్ల కామేసు, మెట్ట అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి: సీఎం జగన్ ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు శనివారం బీసీల చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతూ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీక రించి బీసీలకు అన్యాయం చేయడంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నాశనం చేశారని ఆరోపించారు. 55 నెలల పాటు నియంత పాలన సాగించారన్నారు. టీడీపీతోనే బీసీల ప్రగతి సాధ్యమన్నారు. మబగాం నుంచి ప్రారంభమైన జనచైతన్యయాత్ర జడూరు, పిరువాడ, గాతలవలస, చెల్లాయివలస, అంబీరుపేట, అంపలాం, రేవుఅంపలాం, పోలాకి వరకు సాగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, ఇప్పిలి జగదీశ్వర్, నల్లాన వెంకునాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, షైలపల్లి త్రినాథ్, భైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు, గొండు మురళి, రోణంకి కృష్ణంనాయుడు, లబ్బ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పిలుస్తోంది..' విజయవంతం చేయండి



పలాస: రాష్ట్రంలో వైసీపీ పాలన అస్తవ్యస్తంగా మారిన తరుణంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా గ్రామాల్లో 'పల్లె పిలుస్తోంది.. రా.. కదలిరా' కార్యక్రమాన్ని ఐక్యంగా చేపట్టి విజయవంతం చేయాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి పట్టిన చీడ తొలగి పోవాలని కోరుతూ ఆదివారం సమస్యలను ఎండగడుతూ పత్రాలను భోగి మంటల్లో వేయాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి కోరుకుంటున్నామో తీర్మానం చేసి టీడీపీ గ్రామ అధ్యక్షుడికి అందించాలని, ఓట్లు చెక్ చేసుకోవడం, సంక్రాంతి రోజు టీడీపీ ఆరు పథకాలను ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణం పేరుతో ముగ్గులు వేసి వాటిని సెల్ఫీల ద్వారా సోషల్ మీడియాలో పోస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సొంతూళ్లకు వెళుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త

హిరమండలం: సంక్రాంతి వస్తోందంటేనే అందరిలో ఓ రకమైన ఆనందం.. సొంతూరికి వెళ్లేందుకు ఉత్సాహం చూపుతారు. అయితే స్వగ్రామాలకు వెళ్లేవారు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ఇల్లు గుల్ల అయిపోవడం ఖాయం.. విలువైన వస్తువులు చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది. ఆ నేపథ్యంలో పట్టణాలు, నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. చోరీ జరిగిన తరువాత లబోదిబోమనే కంటే ముందస్తుగా జాగరూకత వహిస్తే చోరీలను నియంత్రించే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ● దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ముందస్తుగా ఇంటి చిరునామా, వివరాలను పోలీసులకు తెలియజేయాలి. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టేందుకు అవకాశం ఉంటుంది.● ఇళ్లలో పనులకు చేరే వ్యక్తుల ఫోన్ నెంబర్లు, ఆధార్ కార్డు నకళ్లను తమ వద్ద ఉంచుకోవాలి. ● జనవాసాలు తక్కువగా ఉండే ప్రదేశాలకు మహిళలు నగలు వేసుకొని వెళ్లకూడదు.● విలువైన వస్తువులు ఇళ్లలో కాకుండా బ్యాంకు లాకర్లతో భద్రపర్చుకోవాలి.● బంగారు నగలు మెరుగుపెడతామని వచ్చే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి ● బ్యాంకు అధికారులమని ఫోన్ చేసి క్రెడిట్ కార్డు ఏటీఎం వివరాలు అడిగినా ఇవ్వరాదు ● అపార్ట్‌మెంట్లలో ఇన్ బుక్, అవుట్ బుక్‌లను పెట్టి వచ్చే వారి వివరాలు నమోదు చేసుకోవాలి. ● దుకాణాలు, కల్యాణ మండపాలు, విద్యా సంస్థలు, సినిమా థియేటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.● మోటార్ సైకిళ్లను ఇంటి బయట నిలిపి ఉంచేటప్పుడు ఫోర్క్ లాక్‌లను వేసుకోవాలి.● ఇళ్లలో మహిళలు ఒంటరిగా ఉండేటప్పుడు అపరిచితులు వస్తే డోర్ తీయవద్దు. లోపలి నుంచి పరిశీలించి వారితో మాట్లాడాలి. ● ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో విలువైన వస్తువులు, నగదు ఉన్న బ్యాగులను జాగ్రత్తగా ఉంచుకోవాలి.

నేడు గోదా, రంగనాథుల కల్యాణం

నందిగాం: పెంటూరు వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త బొడ్డ జనార్దనరావు, అర్చకుడు కె.రవిరామాచార్యులు తెలిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి నాడు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉదయం భోగి మంట వేసిన తరువాత స్వామికి విశేష అర్చనలు చేసి సాయంత్రం కల్యాణం చేపడతామన్నారు. అలాగే సుబ్బమ్మపేట లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో కూడా గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు ధర్మకర్త కేకే గోపాల కృష్ణాచార్యులు తెలిపారు.

బాధిత కుటుంబానికి శివాజీ పరామర్శ

మందస: బహడాపల్లిలో ఇటీవల మృతి చెందిన సాలిన వరలక్ష్మి, మండల కిష్టమ్మ, పులారి రాఘవులు కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, అధికార ప్రతినిధి దాసరి తాతారావు, సభ్యులు లబ్బ రుద్రయ్య ఎం.నవీన్ తదితరులున్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతి ప్రదానం

సంతబొమ్మాళి: దండుగోపాలపురంలో నిర్వహించిన గంగరాపు రమేష్‌కుమార్ స్మారక వాలీబాల్ టోర్న మెంట్ విజేతలకు శనివారం బహుమతులను అందజేశారు. మొత్తం 20 జట్లు పోటీల్లో పాల్గొనగా పూండికి చెందిన సచిన్ జట్టు విజేతగా నిలిచింది. అలాగే టెక్కలికి గ్రౌండ్ జట్టు ద్వితీయ, టెక్కలి అంబేడ్కర్ జట్టు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. వీరికి షీల్డ్‌లతో పాటు నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, తహసీల్దార్ చలమయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

మాకివలసలో బ్యాడ్మింటన్ పోటీలు

నరసన్నపేట: మాకివలస గ్రామంలో మండలస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు శనివారం ప్రారంభించారు. క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ఈ పోటీలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాళ్ల పోలినాయుడు, శిమ్మ పాపినాయుడు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి

నరసన్నపేట: రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం కోమర్తి వద్ద బ్రిడ్జి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆకలి' కథా సంకలనం ఆవిష్కరణ

నరసన్నపేట: ప్రముఖ కథా రచయిత భమిడిపాటి గౌరిశంకర్ రచించిన కథల సంకలనం 'ఆకలి'ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ఆవిష్కరించారు. భమిడిపాటి రచనలు సమాజాన్ని జాగృతం చేస్తా యని కొనియాడారు. కార్యక్రమంలో రచయితల వేదిక అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, సభ్యులు రామజోగిశర్మ, జోస్యుల హరిప్రసాద్, దార్లపూడి శివరామకృష్ణ, ఎల్.గౌరీశంకర్, సోమేశ్వరరావు విజయలక్ష్మి, ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

గాజాపై కాల్పులను విరమించుకోవాలి

కాశీబుగ్గ: గాజాపై తక్షణమే కాల్పుల విరమణ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్ బాబు, రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్వీ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం కాశీబుగ్గ ఒడియా ప్రభుత్వ పాఠశాలలో గాజాకు సంఘీభావ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.గోపికృష్ణ, పలాస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామన్నాయుడు, టీవీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కరవంజలో కాశీవిశ్వేశ్వరస్వామి జాతర

జలుమూరు: కరవంజ గ్రామంలోని కాశీవిశ్వేశ్వర స్వామి 4వ వార్షికోత్సవం ఆదివారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వహక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్వామి వారి గ్రామోత్సవంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీల్లో భాగంగా బంపర్స్ తీత సంగిడి, విసురుడు గుండు, ఉలవల బస్తా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తరించాలని కోరారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోండి

● ఆదివాసీ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి



నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘ నేతలు

జలుమూరు (సారవకోట): నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న బెంతు ఒరియాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్ చేశారు. బొంతు కూడలిలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చకూడదన్నారు. నకిలీ బెంతు ఒరియాలకు కొమ్ముకాస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయను వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. రెండు వారాల్లో నకిలీ బెంతు ఒరియాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు చింతపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు బెజ్జి కృష్ణ, మండల కోఆర్డినేటర్ జన్ని అనిరుద్రుడు, పడాల మాధవయ్య, సరాలంగి ఈశ్వరరావు, తంప రామారావు, జన్ని నీలయ్య, కొంకాడ వెంకటేష్ పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని విస్తృతం చేసేందుకు యాత్ర

● జమ్ము కాశ్మీర్‌కు చెందిన షానురాజ్‌పూత్



పలాసరూరల్/మందస, జనవరి 13: భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, దేశ ఖ్యాతిని విస్తృతం చేసేందుకు సుదీర్ఘ యాత్ర చేపడుతున్నట్లు జమ్మూకాశ్మీర్‌కు చెందిన షానురాజ్‌పూత్ తెలిపారు. పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్, మందస మండలం కుంటికోట ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. దేశమంతటా సైకిల్‌పై యాత్ర చేసేందుకు గత ఏడాది ఆగస్టు 17న జమ్మూ కాశ్మీర్ నుంచి బయలుదేరానని, పంజాబ్, రాజ స్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా, కర్ణాటక, తెలంగాణా మీదుగా సాగుతూ ఆంధ్రప్రదేశ్ చేరుకున్నానన్నారు. ఆదివారం నాటికి ఒడిశా రాష్ట్రంలో ప్రవేశిస్తానని, ప్రతీ రాష్ట్రంలో అక్కడి సంస్కృతీ సంప్రదాయాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సైకిల్ ద్వారా ప్రయాణం ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని, ఎక్కడ బస దొరికితే అక్కడ సేదతీరుతూ తన ప్రయాణం కొనసాగిస్తున్నా నన్నారు. మరో ఐదు నెలల్లో తిరిగి తన రాష్ట్రాన్ని చేరుకుంటానని వివరించారు.

పొగ మంచుతో అపరాల పంటలకు నష్టం

ఎల్.ఎన్.పేట: మండలంలో ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు దట్టంగా ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో అపరాల పంటలైన పెసర, మినుము పంటలకు తీవ్రనష్టం కలుగుతోందని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో లాభదాయ కంగా ఉండే పెసర, మినుము పంటలు పూత, పిందె దశలో ఉన్న సమయంలో పొగమంచు కురుస్తుం డడంతో పంట ముడుచుకుపోయి పిందె మాగిపోతోందని తురకపేట, దబ్బపాడు, చింతలబడవంజ, కృష్ణాపురం, రావిచెంద్రి, ధనుకువాడ, పూశాం, చొర్లంగి తదితర గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. వ్యవసాయశాఖాధికారులు నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంతబొమ్మాళి: సంక్రాంతి సందర్భగా వల్లేవలస మనబడి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. గోవిందపురం, వడ్డివాడ, నర్సాపురం గ్రామాల్లో వీటిని పంపిణీ చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, మెండ రామినాయుడు తెలిపారు. ● కొత్త లింగూడులో శ్రీకాకుళం సత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో 100 మందికి దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు, ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాధగుప్త తదిరతులు పాల్గొన్నారు. ● **కాశీబుగ్గ:** పలాస-కాశీబుగ్గలోని పేదల తెలగ కుటుంబాలకు రాజరాజేశ్వరి దేవి తెలగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బల్ల శ్రీనివాస్ రావు, కార్యదర్శి వాసు, కోశాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ విజేతలు కేరళ, తమిళనాడు

● ద్వితీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్టు

● విజేతలకు మంత్రి అప్పలరాజు బహుమతి ప్రదానం

పలాస, జనవరి 13: జాతీయ టెన్నికాయిట్ పోటీలు శనివారంతో ముగిశాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో టీం చాంపియన్‌గా పురుషుల విభాగంలో కేరళ, మహిళల విభాగంలో తమిళ నాడు జట్లు విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగంలో ద్వితీయ స్థానాన్ని కర్ణాటక, తృతీయ స్థానాన్ని తమిళనాడు, నాలుగో స్థానాన్ని పాండిచ్చేరి జట్లు సాధించాయి. మహిళల విభాగంలో ద్వితీయస్థానాన్ని పాండిచ్చేరి, తృతీయ కేరళ, నాలుగో స్థానాన్ని మహారాష్ట్ర జట్లు పొందాయి.



టీమ్ చాంపియన్‌షిప్ పొందిన తమిళనాడు మహిళల జట్టు

సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో...

పురుషుల సింగిల్స్‌లో తమిళనాడు, కర్ణాటక, కేరళ, కర్ణాటక క్రీడాకారులు వరుసగా మొదటి నాలుగు స్థానాలు పొందారు. మహిళల సింగిల్స్‌లో కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, పాండిచ్చేరి క్రీడాకారులు వరుసగా మొదటి నాలుగు స్థానాలను పొందారు. పురుషుల విభాగం డబుల్స్‌లో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు పొందగా మహిళల విభాగంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర వరుసగా మొదటి నాలుగు స్థానాలను వరుసగా కైవసం చేసుకున్నాయి. మిక్స్‌డ్ డబల్స్ పురుషుల విభాగంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్రలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానం సాధించాయి. ముగింపు కార్యక్రమంలో విజేతల జట్లకు మంత్రి సీదిరి అప్పలరాజు, మునిసిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు బహుమతులను అందజేసి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ నిర్వాహకులు పి.తవిటయ్య, వై.శేఖర్ బాబు, కె.హరిబాబు, వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.



మిక్స్‌డ్ డబుల్స్‌లో ద్వితీయస్థానం సాధించిన ఆంధ్రప్రదేశ్ జట్టు

ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగీ మంట వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు

నందిగాం: పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరా లను నిర్వహించారు. హెచ్‌ఎం కె.గున్నయ్య, ఉపాధ్యాయుడు బాలక శంకరరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణను విద్యార్థులు రంగవల్లికలతో తీర్చిదిద్దారు. భోగీమంట వేసి సందడి చేశారు.

మార్కెట్‌కు పండగ కళ



పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పాతపట్నం: పాతపట్నంలో మార్కెట్‌లో పండగ కళ శనివారం కనిపించింది. భోగి, సంక్రాంతికి అవసరమైన వస్తువులు, కొత్త వస్త్రాలు కొనుగోలుకు శనివారం పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. దీంతో పాతపట్నం కొనుగోలుదారులతో కళకళలాడింది. ఇదిలా ఉండగా దూర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. బస్సులు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు పాతపట్నం వచ్చి ఇక్కడి నుంచి గ్రామాలకు తరలివెళ్లారు.

గుండు సూదిపై బంగారంతో సంక్రాంతి



కాశీబుగ్గ: పలాస కాశీబుగ్గ గాంధీ నగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి శనివారం గుండు సూదిపై బంగారు గాలిపటం తయారు చేసి దానిపై సంక్రాంతి అని అక్షరాలు తీర్చిది ద్దాడు. సంక్రాంతి సందర్భంగా దీనిని 22 క్యారెట్ల బంగారంతో అతుకులు లేకుండా తయారు చేశానన్నారు. దీని బరువు కేవలం 20 మిల్లీ గ్రాములు, తయారు చేసేందుకు గంట సమయం పట్టిం దన్నారు. దీనిని గుండు సూదిపై నిల్చొనేలా బియ్యం గింజంత పరిమాణంలో తయారు చేశానన్నారు. 0.03 మిల్లీ మీటర్లు ఎత్తు, 0.05 మిల్లి మీటర్ల వెడల్పు ఉంటుందన్నారు.

సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభం

ఒడిశా

పర్లాకిమిడి: స్థానిక హైటెక్ ప్లాజాలో మూడు రోజుల పాటు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు హైటెక్ విద్యాసంస్థల అధినేత తిరుపతి పాణిగ్రాహి, బీజేడీ నేత రూపేష్ పాణిగ్రాహి తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలుగు సినీనటుడు సాయికుమార్ తో పాటు ఒడియా, హిందీ బాలీవుడ్ గాయకులు పాల్గొంటారన్నారు. సోమవారం జబర్దస్త్ టీం, మంగళవారం టిక్‌టాక్ స్టార్ దుర్గారావు, పల్సర్ బైక్ సింగర్ రమణల కార్యక్రమాలు ఉంటాయన్నారు.



భోగి మంట వేస్తున్న తిరుపతి పాణిగ్రాహి తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో 1975-76 బ్యాచ్ విద్యార్థులు

జలుమూరు: జలుమూరులోని వెంకట నర్సమ్మ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదువు కున్న విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం నిర్వహించారు. 48 సంవత్సరాల తరువాత వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందం పొందారు. విద్యార్థి దశలో చిలిపి చేష్టలు మరువలేనివని వైజాగ్ కేర్ ఆసుపత్రి కార్డియాలజిస్టు గొద్దు శ్రీరామచంద్రమూర్తి, రిటైర్డ్ డీఎస్పీ దుప్పల రాజేశ్వరరావు తదితరులు అన్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు స్వీకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ● **కవిటి:** రాజపురం హైస్కూల్‌లో 1995-2000 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. శనివారం పాఠశాలలో అంతా కలిసి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులకు సన్మానించారు. ●



పొందూరు: ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పొందూరు: కింతలి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97 ఏడాది పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆత్మీయ కలయిక నిర్వహించారు. నాడు చదువుకున్న 150 మంది విద్యార్థులు తమ కుటుంబా లతో పాల్గొని సందడిగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని సన్మానించారు. సర్పంచ్ పైడి రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కవిటి: నాటి గురువులతో పూర్వ విద్యార్థులు